క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి దాతలు విరాళం అందజేశారు. ఆలమూరు మండలం పెనికేరుకు చెందిన ఉప్పలపాటి గణేశ్వరరావు, నాగమణి దంపతులు బుధవారం అయినవిల్లి ఆలయంలో రూ.25,000 విరాళాన్ని ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను సత్కరించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత


వృద్ధులకు వీల్‌చైర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అశోక్, చిత్రంలో ఆర్‌ఏఓ అంకిత్

యానాం: వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో ఆర్‌ఏఓ అంకిత్‌కుమార్ అధ్యక్షతన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం ద్వారా వృద్ధులకు వీల్‌చైర్లు, చేతికర్రలు తదితర ఉపకరణాలను ఎమ్మెల్యే అశోక్ పంపిణీ చేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ అధికారి రాజేంద్ర పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన

ఐ.పోలవరం: ఎస్పీ రాహుల్ మీనా బుధవారం ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేసుల వివరాలు, శాంతి భద్రతల పరిస్థితులపై ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్సై ఎం.రవీంద్రబాబును ఆరా తీశారు. నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ రాహుల్ మీనా జిల్లాలోని పోలీస్ స్టేషన్లో పరిశీలిస్తున్నారు.

వీరభద్రరావు బాధ్యతల స్వీకరణ

అల్లవరం: రాజమండ్రి డివిజన్ ఎల్ఐసీ ఏఓఐ యూనియన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన అమలాపురం బ్రాంచికి చెందిన సానబోయిన వీరభద్రరావు డివిజన్ అధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత డివిజన్ కార్యాలయంలో సీనియర్ డీఎం సత్యనారాయణ సాహూ, మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, సేల్స్ మేనేజర్ శర్మను ఏఓఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఓఐ రాష్ట్ర కార్యదర్శి రవికిషోర్, డివిజనల్ రెసిడెన్సి కార్యదర్శి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తం మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ రాహుల్ మీనా బుధవారం తెలిపారు. రూ.51 వేల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. లైసెన్స్‌లు లేకుండా మందుగుండు సామగ్రి కలిగి ఉండడం, నివాస గృహాల్లో నిల్వ చేయడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

దసరా ఊరేగింపులపై ప్రత్యేక నిఘా

- వీడియో, డ్రోన్లతో చిత్రీకరణ
- అమలాపురంలో కట్టుదిట్టమైన భద్రత


అమలాపురం దసరా ఉరేగింపు బందోబస్తుపై చర్చిస్తున్న ఆర్డీవో మాధవి, డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్

అమలాపురం టౌన్: రాష్ట్ర వ్యాప్త ఖ్యాతి ఉన్న అమలాపురం దసరా ఉత్సవాలు, ఊరేగింపులకు జిల్లా పోలీస్ శాఖ అన్ని బందోబస్తు ఏర్పాట్లతో సిద్ధమైంది. విజయ దశమి రోజైన గురువారం పట్టణంలో ఏడు వీధుల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏడు ఊరేగింపులు నిర్వహణకు ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకున్నాయి. ఈ ఊరేగింపులను ఆద్యంతం వీడియోలు, డ్రోన్లతో చిత్రీకరించేందుకు అవసరమైన సన్నద్ధమవుతున్నారు. వీడియోలు, డ్రోన్ల చిత్రీకరణ నడుమ పోలీసులు నిఘా కళ్లతో పర్యవేక్షించేలా జిల్లా పోలీస్ శాఖ రంగం సిద్ధం చేసింది. 500 మంది పోలీస్ బలగాలతో బందోబస్తు నిర్వహించే దిశగా జిల్లా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేసింది. ఎస్పీ రాహుల్ మీనా పర్యవేక్షణలో ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 39 మంది ఎస్సైల తోపాటు 116 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు బందోబస్తులో నిమగ్నం కానున్నారు. 172 మంది కానిస్టేబుళ్లు, 16 మంది మహిళా కానిస్టేబుళ్లు, 108 మంది హోంగార్డులు ఊరేగింపుల్లో బందోబస్తుగా ఉండనున్నారు. సాయుధ పోలీసుల బందోబస్తును మొహరించనున్నారు. మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్సులతో గురువారం మొత్తం పట్టణం పూర్తిగా పోలీసు నిఘా నీడలోనే ఉండనుంది. ఊరేగింపుల్లో ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం లేకుండా శాంతియుతంగా ఊరేగింపులు నిర్వహించుకునేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు బుధవారం సాయంత్రానికే సిద్ధమైంది. ఏడు వీధుల ఊరేగింపులను వీడియో చిత్రీకరణ ఆద్యంతం ఉంటుంది.

చెడీ తాలింఖానా ప్రదర్శనల నిర్వహణపై దృష్టి

అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం పర్యవేక్షణలో పట్టణాన్ని జల్లెడ పట్టనున్నారు. ఈ దసరా ఉత్సవాల్లో ప్రధానంగా చెడీ తాలింఖానా ప్రదర్శనల నిర్వహణపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయా వీధుల ఉత్సవ నిర్వాహకులు, చెడీ తాలింఖానా శిక్షకులకు పోలీసులు ప్రత్యేక సూచనలు చేశారు. ఇప్పటికే అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు పట్టణంలోని ఏడు వీధుల ఉత్సవ కమిటీ పెద్దలతో పలు సమావేశాలు నిర్వహించి పోలీస్ ఆంక్షలను వివరించారు. చెడీ తాలింఖానా ప్రదర్శనల్లో ముఖ్యంగా పట్టా కత్తులు, డాలులు, లేడి కొమ్ములు, అగ్గి బరాటాలు, కర్రలు తదితర ఆయుధాలు ఉపయోగించనున్న క్రమంలో పోలీసులు కత్తుల విషయంలో కొన్ని ఆంక్షలు విధించింది. ఉరేగింపుల్లో విన్యాసాల సమయంలో మనుషుల ఉదరాలపై కొబ్బరి కాయలు, కూరగాయలను ఉంచి నరికేందుకు మాత్రమే ఆరు కత్తుల ఆంక్షలు విధించారు. ఆంక్షలు సడలించాలని ఆయా ఉత్సవ కమిటీలు పోలీసులను అభ్యర్థించారు. పోలీసులు కూడా అనాధిగా వస్తున్న దసరా సంప్రదాయాలకు విలువ ఇస్తూ ఊరేగింపులను ఏ గొడవులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించుకునే బాధ్యతను పోలీసులు ఆయా కమిటీల పెద్దల భుజాలపైనే ఉంచారు. ట్యాగ్‌లు ఉన్న కత్తులు మాత్రమే ఊరేగింపుల్లో ఉపయోగించేలా పోలీసులు ఆంక్షలు విధించారు. ఒక్కో వీధి ఊరేగింపుల వద్ద ఇద్దరి సీఐలు,, నలుగురి ఎస్సైలను అనుక్షణం పర్యవేక్షణ కోసం నియమించారు. అమలాపురానికి చేరుకున్న దసరా బందోబస్తు పోలీస్ సిబ్బందికి ఆర్డీవో, డీఎస్పీ, పట్టణ సీఐ, మున్సిపల్ కమిషనర్ ఊరేగింపుల్లో అనుచరించాల్సిన విధి విధానాలపై అమలాపురం మున్సిపాలిటీ భవనంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే అమలాపురం దసరా ఉరేగింపులపై కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీవో కొత్త మాధవి, డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ వారి స్థాయిల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి బందోబస్తుపై సమీక్షించిన సంగతి తెలిసిందే.

నేటి నుంచి అశోక విజయ దశమి ఉత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధవిహార్ ప్రధాన కార్యదర్శి లోక్

అమలాపురం రూరల్: అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో అశోక విజయదశమి ఉత్సవాలు గురువారం నుంచి 14 తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు బుద్ధవిహార్ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్ అన్నారు. బుధవారం నిర్వహించిన బుద్ధవిహార్ పాలక మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం త్రిరత్న బుద్ధవిహార్‌లో బుద్ధవందనం, పంచశీల, అష్టాంగ మార్గ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. క్రూర అశోకుడు ధర్మ అశోకుడిగా మారిన రోజు దశమికి ప్రత్యేకత ఉందన్నారు. చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు కాశీ రాంబోది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి.. మహిషాసుర మర్దినీదేవి


చినకొత్తలంకలో మర్దినీదేవిగా అమ్మవారు


మహిషాసుర మర్దినీదేవిగా అలంకృతమైన అమలాపురం శ్రీదేవి అమ్మవారు


సన్నవిల్లిలో మహిషాసుర మర్దిని అలంకరణలో కనకదుర్గమ్మ


ముమ్మిడివరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి చీర సారె సమర్పించిన మహిళలు


గ్రాంటు గ్రామంలోని పాలకనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక పూజలో పాల్గొన్న మహిళలు

ముమ్మిడివరం: దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి మహిళలు చీరలు సారె సమర్పించారు. ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ముమ్మిడివరంలోని పలు ఆలయాల్లో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి, పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో సువాసినీ పూజ

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు గ్రామంలో యానాం గిరియాంపేట రహదారిలోని పాలకనకదుర్గమ్మ ఆలయంలో సువాసినీ పూజ నిర్వహించారు.

ఘనంగా కుంకుమ పూజలు

ఉప్పలగుప్తం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సన్నవిల్లి గ్రామంలో కనకదుర్గ అమ్మవారిని మహిసాసురమర్ధిని అవతారంలో అలంకరించారు. ఉప్పలగుప్తంలో విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద నాగులపల్లి పాపయ్యరాజు సౌజన్యతంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు దుశ్శాలువాతో దాతను ఘనంగా సత్కరించారు.

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కృషి

అమలాపురం రూరల్: అమలాపురం మండలం బండారులంకలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం బండారులంకలో ఆయన పింఛన్ల పంపిణీ తనిఖీకి వచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతా శంకరమూర్తి, సర్పంచ్ పెనుమాల సునీత డంపింగ్ యార్డు సమస్యను ఆయనకు వివరించారు. ఎమ్మెల్యేతో కలిసి డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ సాయినాథ్ జైచంద్రగాంధీ, మాజీ ఎంపీటీసీ మాడా మాధవి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

ఉప్పలగుప్తం: పెదగాడవిల్లికి చెందిన శతాధిక వృద్ధుడు నిమ్మకాయల సుబ్బారావు (108) మృతి చెందారు. ఈయన 1918 ఆగస్టు 12న జన్మించి బుధవారం తెల్లవారుజామున తుది శ్వాసను విడిచారు. సుబ్బారావు భారత స్వాతంత్ర్యోద్యమ సమయంలో స్థానికంగా పోరాటాల్లో పాల్గొన్నారు. ఆయన భౌతికాయానికి పెద్దాపురం ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో పాటు గ్రామస్తులు, బంధుమిత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాతరలో బాణసంచా పేలుడు

కాట్రేనికోన: మండలంలోని గచ్చకాయలపోర గ్రామంలో మంగళవారం సాయంత్రం అమ్మవారి జాతరలో అగ్నిగుండం వద్ద బాణసంచా పేలుడు సంభవించింది. దీంతో అగ్నిగుండం వీక్షించేందుకు భారీగా వచ్చిన భక్తులు పరుగులు తీశారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతర మహోత్సవ కమిటీ అన్ని భద్రతా ఏర్పాట్లు చేసినా, అగ్నిగుండంలో నిప్పు రవ్వలు చెలరేగడం, అవి గాలికి దూరంగా ఉన్న మందుగుండు సామగ్రిపై పడటంతో ప్రమాదం జరిగింది. ఏటా జరిగే జాతరకు పరిసర గ్రామాలకు చెందిన వారు అగ్నిగుండం వీక్షించేందుకు వస్తుంటారు.

గోదావరి ఉగ్రరూపం


బోడసకుర్రు మత్స్యకార కాలనీలోని ఇళ్ల వద్ద వరద నీరు


గురజాపు లంక కాలనీలో వరద నీరు


యానాంలోని రాజీవ్ పార్కులో వరద నీరు

ముమ్మిడివరం: గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి పెరిగింది. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో లంకగ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేలాది ఎకరాల్లోని వాణిజ్య పంటలు మునుగుతున్నాయి. రెండు రోజులుగా పెరుగుతున్న వరద ప్రవాహం వల్ల మండలంలోని గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయల మధ్య ఉన్న లంక గ్రామాల్లోని ప్రజలు తల్లడిల్లిపోతున్నాయి. లంకల్లో నివాస గృహాలు నీట మునిగాయి. పశువుల్లంక మొండి రేవువద్ద గోదావరి ఉరకలేస్తోంది. సలాదివారి పాలెం వద్ద శేరిల్లంకలో వ్యవసాయ భూములు నదీకోతకు గురవుతున్నాయి. లంకాఫ్ ఠానేల్లంక, గురజాపు లంకలోకి వరదనీరు చేరింది. గోదావరి వెంబడి ఉన్న పశువులను రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

అంతటా అప్రమత్తం

యానాం: గౌతమీ గోదావరి వరద ఉధృతి బుధవారం పెరగడంతో పలు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రాజీవ్ రివర్ బీచ్, ఓల్డ్‌రాజీవ్‌నగర్ తదితర లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ముఖ్యంగా రాజీవ్‌పార్కుతో పాటు సందర్శకులు కూర్చునే బల్లలు, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో బోట్‌హౌస్ ముంపునకు గురయ్యింది. ఏటిగట్లవద్ద ఇసుక బస్తాలను ముందస్తుగా తరలించారు.

పెరుగుతున్న వరద

ఐ.పోలవరం: అన్నంపల్లి అక్విడెక్టు, రాఘవేంద్ర వారధి, ఎదుర్లంక వారధి వద్ద వరద సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. మురమళ్లలో వారధిని ఆనుకుని ఉన్న పాంచల రేవు నీట మునిగింది. కేశనకుర్రు శివారు పల్లెగూడెంలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ల చుట్టూ వరద నీరు చేరుతోంది. పశువుల్లంక, ఎదుర్లంక, గుత్తనదీవి, జి.మూలపాలంలో ఏటిగట్టు దిగువన ఉన్న కొబ్బరితోటల్లో వరద నీరు చేరింది. వరద పోటెత్తడంతో ఆక్వా రైతులు ఆవేదన చెందుతున్నారు.

బోడసకుర్రులో..

అల్లవరం: బోడసకుర్రు జాతీయ రహదారి వద్ద వైనతేయ నది బుధవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. బోడసకుర్రు పల్లిపాలెంలోని మత్స్యకార కాలనీలో 80 కుటుంబాలు వరద ప్రభావానికి గురయ్యారు. ప్రస్తుతం అధికారులు, ప్రజాప్రతినిధులు వరద బాధితులను పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

అన్నదాన భవనానికి శంకుస్థాపన

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో దాత, కిరాణా వర్తక హోల్ సేల్ వ్యాపారి రేపాక సత్యనారాయణమూర్తి నిర్మించనున్న అన్నదాన అదనపు భవనానికి స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బుధవారం శంకుస్థాపన చేశారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ఈవో యర్రా వెంకటేశ్వరరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధుల ర్యాలీ


అమలాపురంలో వయో వృద్ధుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ ర్యాలీని పట్టణ సీఐ పి.వీరబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతనిధులు ర్యాలీతో పాటు పలు వితరణ కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రిక్షా కార్మికులకు సీఐ వీరబాబు చేతుల మీదుగా వస్త్రాలను పంపిణీ చేశారు. ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వర రావు, ముఖ్య సలహాదారు నంబూరి విశ్వనాథం, కార్యదర్శి నూలు సూర్య ప్రభాకరరావు, కోశాధికారి శ్రీఘాకోళపు రాంపండు పాల్గొన్నారు.

మార్మోగిన శరణు ఘోష

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం బుధవారం అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో మార్మోగింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. వీరిలో వందకు పైగా స్వాములు మాల ధారణ చేశారు. ఆలయ పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో తొలుత మాలలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వారికి ప్రత్యేక దర్శనం కల్పించారు.ఆలయ చైర్మన్ శ్రీ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి. సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మీసాల వెంకన్నకు విశేష పూజలు

యానాం: స్థానిక శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి (మీసాల వెంకన్న) ఆలయంలో నిర్వహిస్తున్న 23వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీకృష్ణచైతన్యయాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం


ఇండోర్ కోర్టును ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ తదితరులు

అమలాపురం రూరల్: అమలాపురంలో జీఎంసీ బాలయోగి స్టేడియంలో నూతనంగా నిర్మించిన ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాథుర్ బుధవారం ప్రారంభించారు. వారు కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ కోర్టును నిర్మించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలయోగికి నివాళి

ఐ.పోలవరం: లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా పాత ఇంజరంలోని ఆయన విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్సీ రాజశేఖర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: స్థానిక పోలమ్మ చెరువు వద్ద బాలయోగి విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కోనసీమ అభివృద్ధికి బాలయోగి చేసిన సేవలను వక్తలు కొనియాడారు.